నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్, సోమవారం 14 అక్టోబర్ 2024 | ADILABAD NIRMAL

కేసీఆర్, కేటీఆర్‌కు దసరా శుభాకాంక్షలు

ఖానాపూర్, అక్టోబర్ 13: బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌ను గద్వేల్ వ్యవసాయ క్షేత్రంలో ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని పలు అంశాలపై వారితో చర్చించారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్,కేటీఆర్‌కు దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న భూక్యా జాన్సన్ నాయక్

దసరా వైభవం

ఎదులాపురం : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో గల దసరా మైదానంలో రావణ దహనం

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో కనులపండువగా వేడుకలు

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో శనివారం విజయదశమి(దసరా) వేడుకలు కనుల పండువగా కొనసాగాయి. రావణసుర దహన ఘట్టాన్ని తిలకించేందుకు భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. పోలీసులు ఆయుధపూజ నిర్వహించారు. ర్యాలీలు నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో గల మైదానంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో ఆదిలాబాద్ ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ వెంకటేశ్ దోత్రె పాల్గొన్నారు. నేరడిగొండ మండల కేంద్రంలోని తన నివాసంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆయుధ, వాహన పూజ నిర్వహించారు. అమ్మవారి ప్రతిమకు, ఆయుధాలకు, వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ గౌష్ ఆలం విజయానికి చిహ్నంగా గాలిలోకి ఐదు రౌండ్లను కాల్చి వేడుకలను ప్రారంభించారు. ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయదశమి సందర్భంగా నిర్మల్ పట్టణంలోని మహాలక్ష్మీ అమ్మవారి ఆలయాన్ని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బంగల్‌పేట్‌లో ఏర్పాటు చేసిన జమ్మిపూజ, రావణాసుర దహనాన్ని నిర్వహించారు. భైంసా పట్టణంలోని కిసాన్‌గల్లిలో గల సాయిబాబా మందిరంలో రావణ దహనం నిర్వహించగా.. ఎమ్మెల్యే రామారావు పటేల్, ఏఎస్పీ అవినాశ్ కుమార్ పాల్గొని రావణ దహనం నిర్వహించారు. ఆయుధాలకు సాయుధ దళ కార్యాలయంలో ఎస్పీ జానకి షర్మిల పూజలు చేశారు.

నేరడిగొండలోని తన నివాసంలో ఆయుధపూజ చేస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

శోభాయమానం : దుర్గామాత శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న యువకులు

నిమజ్జనోత్సవం

- ఘనంగా దుర్గామాత నిమజ్జన వేడుకలు
- పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే, ఎస్పీ
- భారీ బందోబస్తు మధ్య శోభాయాత్ర

భైంసా, అక్టోబర్ 13 : భైంసా పట్టణంలో ఆదివారం దుర్గామాత ప్రతిమల నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా కొనసాగింది. విశ్రాంతి భవనం ఎదుట, పురాణా బజార్‌లో గల యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల వద్ద ఎమ్మెల్యే రామారావు పటేల్, ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ అవినాశ్ కుమార్, హిందూ ఉత్సవ సమితి సభ్యులు పూజలు నిర్వహించారు. ఈ శోభాయాత్ర యువకుల నృత్యాలు, కోలాటాలు, పోతరాజుల విన్యాసాల మధ్య కొనసాగింది. పట్టణ సమీపంలో గల గడ్డెన్నవాగు ప్రాజెక్టులో దుర్గామాత ప్రతిమలను నిమజ్జనం చేశారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు ప్రాజెక్టు వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.

భారీ పోలీసు బందోబస్తు

దుర్గామాతల నిమజ్జనం సందర్భంగా ఆదివారం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ, ఏఎస్పీ, డీఎస్పీ, నలుగురు సీఐలు, ఏడుగురు ఎస్సైలు, 250 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. నిమజ్జనోత్సవం సందర్భంగా యువకులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆయా రూపాల్లో ఉన్న దుర్గామాతలకు పట్టణవాసులు పూజలు జరిపారు. శోభాయాత్ర దృశ్యాలను మహిళలు, చిన్నారులు తడాబాలపై నుంచి తిలకించారు. శోభాయాత్ర మార్గంలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

మోసకారి కాంగ్రెస్‌ను నిలదీస్తాం

రైతు సంక్షేమాన్ని విస్మరిస్తున్న సీఎం రేవంత్

- ఉద్యోగాలు మేమే ఇచ్చామని చెప్పకోవడం సిగ్గు చేటు
- రుణమాఫీ, రైతుభరోసా వంటి ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఏమైంది?
- జిల్లాకేంద్రంలో భారీ ఎత్తున రైతులతో కార్యక్రమాన్ని చేపడుతాం..
- ఈ నెల 24 న హాజరుకానున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నియోజకవర్గ నేతలతో మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, అక్టోబర్ 13 : 'బూటకపు హామీలతో అన్నదాతలను, సామాన్య ప్రజానీకాన్ని మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్ర స్థాయిలో ఎండగట్టాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆదిలాబాద్ నియోజకవర్గ నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్ అసమర్థ పాలనలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. రైతుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఈనెల 24వ తేదీన జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తున్నారని, ఈ నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, ప్రజల ఇక్కట్లు, రైతులకు ఇచ్చిన హామీల వంటి అంశాలపై దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. కేసీఆర్ స్ఫూర్తితో మరోసారి టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఉద్యమానికి సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. రుణమాఫీ, రైతు భరోసా వంటి ఆరు హామీలకు చట్టబద్ధత కల్పిస్తామన్న రేవంత్ హామీలను బుట్టదాఖలు చేస్తున్నారని మండిపడ్డారు. మహిళలకు పెన్షన్, పెన్షన్ పెంపు వంటి హామీలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. కేసీఆర్ హయాంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రారంభమైతే.. ఉద్యోగం సాధించిన వారికి నియామక పత్రాలు అందచేసి తామే నోటిఫికేషన్లు జారీ చేసినట్లు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. కేటీఆర్ హాజరు కానున్న సమావేశానికి రైతులు, రైతు కూలీలు, శ్రేణులు భారీ సంఖ్యలో హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రోకండ్ల రమేశ్, అజయ్, ఇజ్జగిరి నారాయణ, రౌతు మనోహర్, యూనిస్ అక్బాని, గండ్రత్ రమేశ్, సాజిదొద్దీన్, సలీం, ప్రమోద్‌రెడ్డి, సతీష్ పవర్, లింగారెడ్డి, మార్చెట్టి గోవర్ధన్, గండ్రత్ రమేశ్, కొమురరాజు, బొడగం మమత, సేవ్వా జగదీశ్, గంగయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

'సన్న'గిల్లుతున్న ఆశలు

- ఎండకు తెగులు, దోమపోటుతో తిప్పలు
- ఈ ఏడాది అధిక శాతం సన్న రకం సాగు
- దిగుబడిపై అధిక ప్రభావం
- పొట్టదశలో ఉండడంతో డ్రోన్‌లతో పిచికారీ

సోన్, అక్టోబర్ 13 : ఈ యేడాది వర్షాలు సమృద్ధిగా కురవడం, సన్న రకాలకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు సన్నరకాల వైపు మొగ్గు చూపారు. జిల్లాలో దాదాపు 70,500 ఎకరాలు సాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో మొన్నటి వరకు వరి పైరు పచ్చగా, ఏపుగా వస్తుండడంతో దిగుబడులు బాగానే వస్తాయని రైతులు భావించారు. ఈ తరుణంలో 20 రోజులుగా వాతావరణంలో మార్పులు రావడంతో సన్నరకం వరి పైరుకు ఎండకు తెగులు, దోమపోటు వస్తుండడంతో ఏమి చేద్దామన్న ఆలోచనలో పడ్డాడు. మొన్నటివరకు మంచి దిగుబడులు వస్తాయనుకుంటున్న తరుణంలో ఈ తెగులు పొట్ట దశలో సోకుతుండడంతో ఏమి చేద్దామన్న ఆలోచనలో పడ్డాడు. మొన్నటి వరకు బాగా ఉన్న పంట ఒక్కసారిగా ఎండు తెగులు సోకవడంతో డ్రోన్‌లతో మందును పిచికారీ చేస్తున్నారు. అయినప్పటికీ దిగుబడి తగ్గుతుందని, పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. నత్రజని ఎరువులను తక్కువ వాడినప్పటికీ ఎండు, అగ్గి తెగులు, దోమపోటు ఎలా సోకాయోనని దిగులు చెందుతున్నారు. ఏ మందును పిచికారీ చేస్తే తగ్గుముఖం పడుతుందోనని తెలుసుకోవడానికి దుకాణాదారులు, వ్యవసాయశాఖ అధికారుల వద్దకు రైతులు వెళ్తున్నారు. ప్రస్తుతం ఎకరానికి కనీసం రూ.25 వేలు పెట్టుబడి పెట్టగా ఎలా వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు.

పొట్ట దశలో ఉన్న వరి పంటకు డ్రోన్‌తో పిచికారీ చేస్తున్న ఓ రైతు

పదేకరాల్లో సన్నరకం వేశా..

ధర మంచిగా ఉంటదని మొత్తం పదేకరాల్లో సన్న రకం వరి వేశా. మొన్నటి వరకు వరి పైరు బాగా ఉండడంతో దిగుబడి బాగా వస్తుందన్న నమ్మకం ఉండే. ఇప్పుడు వరి రోజురోజుకు ఎండు తెలుగు సోకవడంతో రెండు సార్లు డ్రోన్‌తో మందును పిచికారీ చేశా. పెట్టిన పెట్టుబడి వస్తాదో లేదోనన్న నమ్మకం లేదు.

- వీరమల్ల నవీన్‌కుమార్, రైతు, వెంగ్వాపేట్

తెగులు గమనించి పిచికారీ చేసుకోవాలి..

రైతులు పంటకు తెగులును గమనించి మందును పిచికారీ చేసుకోవాలి. ఎండు తెగులు నివారణకు ఎకరాకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 500 గ్రాములు, ప్లాంటామైసిన్ 100 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. అగ్గి తెగులు ట్రైక్లోజోల్ 120 గ్రాము ఎకరానికి పిచికారీ చేయాలి. దీంతోపాటు దోమపోటుకి పైమెట్రోజైన్(50 శాతం డబ్ల్యూజి) 120 గ్రాములు ఒక ఎకరానికి పిచికారీ చేసుకోవాలి.

- వసంత్‌రావు, ఏడీ, నిర్మల్

ఇండ్లపై కమ్మేసిన పొగమంచు

కమ్మేసిన పొగ మంచు

బోథ్ మండలాన్ని ఆదివారం పొగమంచు కమ్మేసింది. సూర్యోదయం వేళ దట్టమైన పొగమంచు వ్యాపించడంతో వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్తున్నారు. ఈ పొగమంచు మూలంగా పత్తి, పూత దశలో ఉన్న కంది పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

- బోథ్, అక్టోబర్ 13

అమ్మవారిని దర్శించుకుంటున్న బిల్‌రాజు, తన మనవడికి అక్షర శ్రీకారం చేయిస్తున్న తనికెళ్ల భరణి

అమ్మవారిని దర్శించుకున్న సినీ ప్రముఖులు

బాసర సరస్వతీ అమ్మవారిని ఆదివారం ప్రముఖ సినీ నిర్మాత బిల్ రాజు, నటుడు తనికెళ్ల భరణి కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వీరికి అధికారులు, అర్చకులు స్వాగం పలికారు. అనంతరం తనికెళ్ల భరణి తన మనవడికి అక్షరాభ్యాసం నిర్వహించారు.

- బాసర, అక్టోబర్ 13

ఘనంగా అమ్మవారి శోభాయాత్ర

బాసర, అక్టోబర్ 13 : బాసర సరస్వతీ అమ్మవారి శోభయాత్ర శనివారం జరిగింది. అమ్మవారి ఉత్సవ మూర్తిని అశ్వరథంపై ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించిన అర్చకులు అమ్మవారి ఉత్సవ మూర్తికి పూజలు చేసి రథంలో ఉంచారు. సంప్రదాయబద్ధంగా అత్యంత భక్తిశ్రద్ధలతో మేళతాళాల మధ్య శోభాయాత్ర కొనసాగింది. వివేకానంద చౌక్ వద్ద మహిళలు అమ్మవారికి మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఊరేగింపు అనంతరం ఆలయం వద్ద అర్చకులు శమీపూజ నిర్వహించారు.

సరస్వతీ అమ్మవారి ఉత్సవమూర్తితో శోభాయాత్ర నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు